


# కలల కౌగిలి

## నవలారాణి నవలల నేపథ్యం



ప్రతి మనిషీ జీవితంలో ఎప్పుడో ఓసారి కలల కౌగిలిలో చిక్కుకుని బందీ అవకమానడు. దేనికో దానికోసం. ఇంజినీర్ అవాలనో, వ్యాపారవేత్త కావాలనో, మంచి గృహిణి కావాలనో, డాన్సర్ కావాలనో, సంఘసేవిక కావాలనో, అంతరిక్షయాత్రికురాలు కావాలనో, చిన్న షాపు పెట్టుకోవాలనో, ఒక్కసారి అయినా టీ.వీలో కనబడాలనో, ఇలా వేల, లక్షల కలలు ప్రతి మనిషికి మదిలోనూ అంతర్గతంగా ఇమిడి ఉంటాయి. కొంతమంది వెరపు లేకుండా తమ కలల గురించి బాహాటంగా చెప్పేస్తారు. మరికొంతమంది తమ కలల గురించి చెప్పరు. బిడియంతో గుండెల్లో దాచేసుకుంటారు. మనది వాక్స్వాతంత్ర్యం ఉన్న దేశం అంటారు. అది రాజ్యాంగం వరకే పరిమితం అని నాకు అప్పుడప్పుడు అనుమానం వస్తుంది. ముఖ్యంగా స్త్రీల విషయంలో వాక్ స్వాతంత్ర్యానికి చాలా అడ్డుగోడలు కట్టేసిన సంఘం మనది. స్త్రీ నోరు విప్పింది అంటే సంఘం నోరెత్తలేని విషయాలు చాలా ఉన్నాయని అందరికీ తెలుసు. స్త్రీ పెళ్ళి పట్ల గౌరవంతో, పిల్లల పట్ల ప్రేమతో తను అడ్డుగోడల మధ్య ఒద్దికగా నిలబడిపోతుందని నా నమ్మకం.




నా దగ్గరికి వచ్చే అనేక మంది స్త్రీలలో, వారి మనసులో అంతర్గతంగా ఎన్ని కలలు ఉన్నాయో వాటిని నిర్వర్తించుకునే సామర్థ్యం ఉండికూడా, వాటికి ప్రాధాన్యత ఇవ్వకుండా సామాన్యమైన స్త్రీలలా ఎలా జీవితం గడిపేస్తూ ఆనందంగా ఉన్నారో గమనిస్తే నాకు చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఇప్పటి తరం అత్యంత ప్రతిభావంతంగా రూపుదిద్దుకుని, దేశగౌరవం, మన సంస్కృతి, గౌరవం వేయి ప్రభలతో వెలుగొందేలా అందరి మన్ననలూ అందుకుంటోంది అంటే ఈ తరం వెనుక, పిల్లల భవిష్యత్తు కోసం అహోరాత్రులు స్వార్థం లేకుండా పనిచేసిన తలితండ్రులు అయిన నిన్నటి తరం గుర్తుకు వస్తుంది. వారి కలలన్నీ పిల్లలలో రూపు దిద్ది తాము అవాల్సిన విజేతలు వెనక ఉండి ఇప్పటి తరాన్ని ముందు పెట్టి ఆనందం అనుభవిస్తున్నారు. దీనికి ఎంత ఓర్మి కావాలో, ఎంత శ్రమ పడాలో, కొన్ని కుటుంబాల్లో భార్యాభర్తలని చూస్తుంటే అర్థం అవుతుంది.

కలలు కనడం అందరి హక్కు! నిజమే కానీ వాటిని సాకారం చేసుకోవాలంటే అందరికీ చాలా వరకు సాధ్యం కాదు. కలలు మనిషిని ఉత్తేజపరుస్తాయి. వేధిస్తాయి కూడా! గోతుల్లో పడేసి కాలు, కీలు విరక్కొట్టి అందరూ వెక్కిరిస్తూ నవ్వేలా చేస్తాయి. కానీ

పట్టుదలతో జీవితం పట్ల కలలు కని వాటిని సాకారం చేసుకునే వ్యక్తులు ధన్యులు.

నాకు తెలిసిన ఒక కుటుంబంలో ఒకాయన వజ్రాల వ్యాపారం చేస్తాడు. వ్యాపార పరంగా ఆయన విజేత అని చెప్పవచ్చు. కానీ ఆయనకి చిన్నప్పటి నుంచీ పువ్వుల కొట్టు పెట్టుకోవాలని, విదేశాలకి ఎగుమతి చేయాలని, పువ్వులతోట పెంచాలని ఒక డ్రీమ్ వరల్డ్. ఆయన సంపాదించిందంతా మెల్లగా ఈ పువ్వుల కౌగిలి కోసం వెచ్చించసాగాడు. వజ్రాల వ్యాపారం మీద వచ్చినదంతా ఇందులో పెట్టడంతో భారీగా నష్టం రాసాగింది. అయినా ఆయన పట్టుదలగా వదలలేదు. కానీ ఇంట్లో భార్యా, పిల్లలు, స్వంత తల్లితండ్రులతో పెద్ద పేచీ వచ్చేసింది. ఆ పువ్వుల వ్యాపారంలో డబ్బు తగలేస్తున్నాడనీ, అది మూసేయకపోతే అందరూ కలిసి మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. బంధువులు వచ్చి ఈ పువ్వుల పిచ్చి వదిలించటానికి కౌన్సిలింగ్‌కి పంపించాలని నిర్ణయం చేసారు. ఆయనకి నిజంగానే పిచ్చి ఎక్కినంత పనైంది. మొత్తానికి 'పువ్వుల కౌగిలి' నుంచీ ఆయనని భార్యాపిల్లలు, బంధువుల సాయంతో పోరాడి గెలిచి విడిపించారు. అది వారి విజయం. ఇది ఆయన అపజయం. ఇప్పుడు చెప్పండి. కుటుంబాలతో పెనవేసుకు పోయిన మన జీవితాలలో మనలో ఒక్క వ్యక్తికైనా తన కిష్టమైన కలలు సాకారం చేసుకునే స్వతంత్ర్యం ఉందంటారా! నా కయితే చాలా అనుమానమే.

'కలల కౌగిలి' అన్న పేరు నాకెందుకో తట్టింది. ఇది నాకు చాలా ఇష్టం. ప్రతీ మనిషిలోనూ ఈ కౌగిలికి తహతహలాడే ఆంతర్యం ఉంటుంది. అది కెరీర్ కావచ్చు. ప్రేమ కావచ్చు. దేశభక్తి కావచ్చు.

ఎంతో మంది ఆంతర్యాల లోగిళ్ళలోకి వెళ్ళి వాళ్ళ కలలనీ - ఫెయిల్యూర్స్‌ని విన్నదాన్ని నేను.

'కలల కౌగిలి' పేరు ఇన్‌స్పిరేషన్ నా అభిమాన పాఠకులే!

ఇందులో హీరో తలితండ్రుల ఆప్యాయత కోసం పరితపించే పసిమనసు కుర్రాడు సత్యజిత్. తలితండ్రుల స్వార్థచింతనతో బెంగుళూరులో ఉన్న బంధువురాలికి పెంపకం వెళ్ళి పీనాసి అయిన ఆవిడ చేతిలో నానా బాధలు పడి, ఇంటికి పారిపోయి వస్తే, తలితండ్రులు తీసుకు వెళ్ళి మళ్ళీ సత్యజిత్‌ని, ఆ పీనాసి ఆవిడకి అప్పచెబుతారు. అందరి పిల్లల్లా మామూలు బాల్యం కోసం తపించే సత్యజిత్, పెంపుడు తల్లి అనే రాక్షసి చేతిలో ఇరుక్కుంటాడు. తలితండ్రుల దగ్గరకి ఇక వెళ్ళలేనని తెలుసుకున్న సత్యజిత్ సెల్ఫ్‌డిఫెన్సు కోసం మారిపోతాడు. ఆ నమ్మకాలతోనే పెరిగి పెద్దవాడవుతాడు. డబ్బుగలవాళ్ళని బ్లాక్‌మెయిల్ చేయటం, భయపెట్టడం అతనికి ఒక థ్రిల్. అదే నిజమైన జీవితం అని నమ్ముతాడు. అతని జీవితంలో భారతి ప్రవేశిస్తుంది. అతను ఇంత వరకు 'నమ్మిన' జీవితం అబద్ధం అయినది అని తెలుసుకుని మారటానికి ప్రయత్నిస్తాడు. 'భారతి' అనే మంచి మనిషిని చేరుకోవాలన్నది అతని కల అవుతుంది. కానీ 28 సంవత్సరాల అనుభవం అతన్ని వదలదు. వదిలించుకుని, మంచి జీవితానికి మారుపేరుతో నిలబడిన భారతికి చేరువ అవటానికి అతను పడిన నరకయాతనే 'కలలకౌగిలి'.

మనలో చాలామంది జీవితంలో కొంత దూరం నడిచినిన తర్వాత మార్గం మలుపు తిప్పుకోవాలని తపిస్తాం. కానీ అది అంత సులభసాధ్యం కాదు. కానీ ఈ ప్రపంచంలో పట్టుదల, ఓర్మి అనేవి మనకుంటే మన జీవితానికి మనమే సార్వభౌమాధికారి అవగలం అని నిరూపిస్తుంది ఈ నవల.

WWW.IWOMAN.IN
ORDINARY WOMAN EXTRAORDINARY POWER

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి గారు YSSR ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సేవా సంస్థని స్థాపించి అనేక సామాజిక సేవా కార్యక్రమాలని నిర్వహిస్తున్నారు. హైదరాబాదులోనూ, ప్రపంచవ్యాప్తంగానూ వున్న అనేకమంది ప్రముఖులు ఈ సంస్థ సేవాకార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. ఈ సంస్థ తరఫున వీధి బాలలసంక్షేమ కార్యక్రమాలూ, వృద్ధుల సంక్షేమకార్యక్రమాలూ, అంగవికలులకు వైద్య సదుపాయాలూ, స్వయం ఉపాధి పథకాల రూపకల్పన, వాటిని అమలుచేయడం లాంటి అనేక కార్యక్రమాలని స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ కార్యక్రమాల వివరాలకోసం, సేవాకార్యక్రమాల సమగ్రసమాచారంకోసం HTTP://WWW.IWOMAN.IN *(CLICK HERE TO GO THERE)* వెబ్ సైట్‌ని సందర్శించండి. ఈ సంస్థ సేవాకార్యక్రమాల్లో పాల్గొనదలచిన వారు 'కౌముది' ని కానీ, నేరుగా శ్రీమతి యద్దనపూడి గారిని కానీ సంప్రదించ వలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

ఎడిటర్